

# మిథ్య

సర్వజిత్

**రిక్షావాడు** నెమ్మదిగా, బరువుగా లాగుతున్నాడు రిక్షాని.

అలాగని రిక్షాలో బరువైన మనుషులుగానీ, సామానూ లేదు.

వాడే కనక ప్రభుత్వోద్యోగి అయినట్టయితే ఎప్పుడో రిటైర్ కావలసిన వాడు. ఈ జీవితానికి రిటైర్మెంటు లేదు.— సత్తువ సడలితే తప్ప.

రిక్షాలో మరీ ఎముకల పోగులా కాకపోయినా, బక్కగా వెంకటగిరి చీరతో కామేశ్వరమ్మ కూర్చున్నది. ఆమె పక్కనే ఏవో యుక్త ప్రశ్నలు వేస్తూ ఎనిమిదేళ్ళ మనమరాలు, నాలుగైదు పూలదండలూ, ఒక చిన్న పాకెట్టూ ఉన్నాయి.

ముప్పై యేళ్ళ ఉద్యోగ జీవితం నుంచి రిటైరై ఆ రోజు స్కూల్లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభనుంచి ఇంటికి వస్తున్నది కామేశ్వరమ్మ.

ఉద్యోగం నుంచి తల్లి రిటైరయి పోయిందని తెలిసి రెండు రోజుల నాడు ఇద్దరు కూతుళ్ళు, కొడుకు హడావుడిగా రెక్కలు కట్టుకుని వచ్చి వాలారు.

కానీ కామేశ్వరమ్మకి జరిగే వీడ్కోలు సభలోని విషాదాన్నీ, సంతోషాన్నీ పంచుకోవాలని వాళ్ళకి లేదు. కూతుళ్ళిద్దరూ సినిమాకి పోగా, కొడుకు మాత్రం ఫంక్షన్‌కి వచ్చి 'వచ్చేను సుమా' అన్నట్లు కామేశ్వరమ్మకి కనిపించి, కాసేపు అటూ ఇటూ తిరిగి వెళ్ళిపోయాడు.

భర్త రామనాథం మాత్రం ఆమెతో వచ్చి ఫంక్షన్ అయ్యేదాకా ముందు సీట్లో కూర్చున్నాడు. కార్యక్రమం ముగిసిన తరువాత స్వయంగా భార్యని రిక్షా ఎక్కించి: "ఒక పది ఉంటే ఇస్తావా?" అని ఎటో చూస్తూ అడిగి పుచ్చుకుని, "నువ్వెళ్ళు. నేను బజారు కెళ్ళి వస్తా" అన్నాడు.

బజారుకి వెళ్ళకముందే ఆమెకు తెలుసు పేకాట కని. నిస్సహాయంగా ఆమె నవ్వుకున్నది.

ముప్పై ఏళ్ళ పైబడ్డ జీవితం తాలూకు చేదు అనుభవా లవి. ఆ చేదు అనుభవించి అలవాటు పడిపోయింది.

కూతుళ్ళకి తనకి జరిగే వీడ్కోలు వగైరా విషయం మీద శ్రద్ధ లేకపోయినా రెండో కూతురు సంతానం ఈ ఎనిమిదేళ్ళ పిల్ల మాత్రం అమ్మమ్మతో వెడతానని సినిమాకి వెళ్ళకుండా ఆమెతో వచ్చింది.

రిక్షా నెమ్మదిగానే పోతూంది. రాత్రి పొద్దుపోవడంతో రిక్షాలో జోగుతున్న మనవరాల్ని ఒడిలో పడుకో పెట్టుకున్నది కామేశ్వరమ్మ.

రోజూ స్కూలుకి నడిచి వెళ్ళి వచ్చే ఆ రోడ్డు ఇప్పుడు ఆమెకి ఏదో కొత్తగా అనిపించసాగింది.

ఇటు భర్త, అటు సంతానం—ఈ రెండు విభిన్న అనుబంధాల మధ్య ఆమె మనస్సు నలిగి పోతూంది.

ఇన్నాళ్ళూ ఉద్యోగం చేసిందీ అంటే కొంత భుక్తికి, మరి కొంతవరకూ మనశ్శాంతి కోటే గడిచిపోయింది.

పెళ్ళయ్యాక భర్త చాటు భారతనారిలా బతకాలన్న తపన సాధ్యపడలేదు కామేశ్వరికి.

అప్పటికే ఎల్. డి. క్లార్కుగా ఉద్యోగం వెలగ బెడుతున్న రామనాథం, ఏ బరువూ బాధ్యతలూ

15—2—84

లేకపోయినా ఎప్పుడూ డబ్బు లేదు లేదంటూనే సంసారం ఈడ్చేవాడు.

పెరిగే ధరలని అందుకోలేని ఎల్. డి. సి. జీవితాలు ఇంతే కాబోలు నని సరదాల్నీ, సంబరాల్నీ జోకొట్టుకుని ఇమడాలనుకున్న కామేశ్వరికి భర్తలో రాజా, రాణీ, జాకీలు కనిపించాక రెండు రోజులు మవునంగా కుళ్ళి కుళ్ళి ఏడిచింది. అనునయించింది. అలక వహించింది.

"పిచ్చిదానా! నాతో నీ కాపరం ఏడాది నుంచే మొదలయింది. పేకతో నా కాపరం పదేళ్ళు పైబడ్డ అనుబంధం" అంటూ భార్యని జోకొట్టేశాడు రామనాథం.

అప్పటికి భూమిమీద పడ్డ ఇద్దరు పిల్లలు, పడబోతున్న మరోసంతానాన్ని దృష్టిలో పెట్టుకుని తనూ ఉద్యోగం చెయ్యాలనే అనుకున్నది కామేశ్వరి.

అను, జాకీలకి అలవాటు పడ్డ భర్త మారతాడనీ, కుటుంబాన్ని ఏదో ఉద్ధరిస్తాడనీ కామేశ్వరిలో ఆశ సన్నగిల్ల సాగింది.

సెకండరీ గ్రేడు ట్రైనింగు, ఉద్యోగాలకి ఎన్ని తిప్పలు పడిందో, వంటా పనీ వగైరా తెములక ఎన్ని పూటలు మాడిందో ఆ భగవంతుడికే ఎరుక.

ఏ కళ నున్నాడో ట్రైనింగులో సీటుకి, ఆ తరవాత ఉద్యోగానికీ రామనాథంకూడా అంతో ఇంతో శ్రమ పడక పోలేదు. అందుకు అతనిలో స్వార్థమే కావచ్చు.

అప్పటిలో కామేశ్వరికి ఉన్న సౌలభ్యమల్లా, ట్రైనింగ్ సెంటరు వూళ్ళో కావడమే.

తరవాత ఉద్యోగంలో బదిలీలు, అయిదారేళ్ళు పిల్లలతో తనూ, ఒంటరిగా అతనూ తలో మూలా ఎడబాటు ఆమె చేదు అనుభవాల్లో మరి కొన్ని.


విచిత్రమేమిటంటే ఒంటరిగా ఉంటూన్నప్పుడు కూడా, సెలవు రోజు భార్యా పిల్లల దగ్గర కొచ్చిన రామనాథం—వెడుతూ ఓ వందో, ఏభయ్యో ఇస్తావు అని అడిగి తీసికెళ్ళడం నిజంగా కామేశ్వరి మనస్సుకి చివుక్కుమనిపించేది.

ఒక పెంకుటిల్లు తప్ప పెద్దవాళ్ళు మరేమీ రామనాథానికి ఆస్తి ఇచ్చి పోలేదు. అది కూడా కట్టి చాలా కాలమయ్యిందేమో, ఇంచుమించు బీటలు వారి బాగుచేతకు సిద్ధంగా ఉంది.

బదిలీల ప్రహసనంలో పరాయి చోట ఉన్నప్పుడు ఆ ఇంటి మీద వచ్చే కొద్దో గొప్పో అద్దె కూడా రామనాథమే పుచ్చుకునేవాడు.

అయినా కామేశ్వరి అద్దెలు ఎంత వస్తున్నాయని కానీ, ఏం చేశారని కానీ అడిగేది కాదు. డబ్బు అంటూ దొరికితే భర్త ఏం చేస్తాడో తెలియకపోతే కదా!

ఎలాగో బి. ఏ, తరవాత బి. ఇడి. కూడా చేస్తే ఉద్యోగంలో ప్రమోషనూ, జీతమూ పెరుగుతాయన్న ఆలోచన కామేశ్వరిలో ఉండేది కానీ, డిపార్టుమెంటు టెస్టులకి వెళ్ళి ఎల్. డి. సి. నుంచి పైకి పాకుదామన్న కనీసఆలోచనకూడా రామనాథంలో లేకపోవడం ఆమెకి తరచుగా ఆశ్చర్యం కలిగించేది.




సలహాగా భర్తకి చెప్పింది. అనునయించింది.

"ఉన్నది చాలు లేవోయ్" అని నాలుకతో కొట్టి పారేసే భర్తని చూసి చీదరించుకున్న ఘటనలూ ఉన్నాయ్.

ఎదిగిన పిల్లలు, చదువులు, ఇంటి ఖర్చులు, వీటితోబాటే పెరిగిన రామనాథం పేకాట ఖర్చులు, రేసు హుషార్లు—ఈ దశలో విధిగా కామేశ్వరి ట్యూషన్లు చెబుతూ కనీస విశ్రాంతికూడా వదులుకోక తప్పలేదు.

జీవితంలో ఆమె సాధించిన విజయాలు మాత్రం రెండే. ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళకి భర్త పి. ఎఫ్. నుంచి మాత్రమే అప్పు తీయించ గలిగింది. ఎందుకంటే అతను రిటైర్ అయ్యాక ఆ పి. ఎఫ్. డబ్బు కూడా సక్రమంగా ఇంటికి తెస్తాడన్న నమ్మకం ఆమెకి ఏ నాడో సన్నగిల్లి పోయింది. కొడుకు పెళ్ళికి వచ్చిన కట్న కానుకలుకూడా భర్త చేతికి దక్కకుండా కొడుకు పేరనే మిగిలిన మొత్తం బాంక్‌లో వేసేసింది కామేశ్వరమ్మ. అందుకు రామనాథం గింజుకున్నాడు.మూడు నాలుగు రోజులు అలిగి కూర్చున్నాడు

బరువు బాధ్యతలని ఇంతగా ఆమె తీర్చి దిద్దినా ఇంకా ఆమెకి చికాకులు తప్పలేదు.

చిన్నప్పటినుంచీ పెళ్ళిళ్ళయి కాపరాలు చేసుకుంటూన్నంతవరకూ పిల్లలు విసిగించి, కోపగించుకుని, గొంతెమ్మ కోర్కెలతో ఎంతగా కాల్చుకు తిన్నారో వాళ్ళూ పిల్లల తల్లులు,తండ్రులూ అయినా ఇప్పుడూ ఇంకా పుట్టింటి నుంచి ఏదేదో కావాలంటూ కాల్చుకుని తింటూనే ఉన్నారు.

అయిదేళ్ళ కిందట రామనాథం రిటైరై పోగా గతంలో తీసికున్న లోనులు, వగైరా అన్నీ పోను చేతి కొచ్చిన ఏ డెనిమిది వేలు రూపాయల్తో ఇల్లు దక్షిణం వేపు మరీ కూలి పోతూందని కామేశ్వరమ్మ పోరగా పోరగా విసుక్కుంటూ ఒక రెండు వేలు ఖర్చు పెట్టి రిపేరు చేయించాననిపించాడురామనాథం.

"మిగిలిన డబ్బు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేస్తారా?" అని కామేశ్వరమ్మ అడిగితే—

"ఎప్పుడూ వెధవ దాపరికమే. ఏదో తగలడతాను" అని చిటపటలాడి రెండ్రోజులు పోయాక డబ్బు బాంక్‌లో వేశాను అని మాత్రం చెప్పాడు.

ఆ డబ్బు మీద కామేశ్వరమ్మ ఆశ పెట్టుకో లేదు. ఆమె అనుకున్నట్లుగానే భర్త సంబరం చేసేసుకున్నాడు. ఎన్నాళ్ళకి మంగళం పాడడనేది అతనికే తెలియాలి.

నిజానికి తాను ఉద్యోగంలో ఉండగానే తనువు చాలిస్తే బాగుండునని కామేశ్వరమ్మ భావించింది. కానీ ఆమె కోర్కె తీరలేదు. సెకండరీ గ్రేడ్ టీచర్‌గా రిటైర్ అయింది, జీవిత జంజాటనలు నుంచి తప్ప!

భర్త రిటైరయిన తరవాత తననుకూడా వాలంటరీ రిటైర్మెంటు తీసుకుని 'మీరిద్దరూ నా దగ్గిరికి వచ్చి ఉండండి అమ్మా' అని మాట వరసకైనా కొడుకు అంటాడేమోనని ఎదురు చూసిన కామేశ్వరమ్మకి నిరాశే మిగిలింది.


"చాలా ఇబ్బందుల్లో ఉన్నాం—నాన్నకి వచ్చే డబ్బులో ఒక రెండు వేలు ఇవ్వ" మంటూ కొడుకూ, వంతగా కోడలూ వోదార్పులు పల్లవించారు.

ఇప్పుడు తను పదవీ విరమణ చేసింది.

తల్లి రిటైర్ అయిందనగానే, డబ్బు చేతికి వచ్చే టైముకి కొడుకూ, ఇద్దరు కూతుళ్ళూ హడావుడిగా వచ్చేశారు. ఇబ్బందులు వెళ్ళబోసుకున్నారు. ముక్కులు చీదుకున్నారు. కట్టుకున్న పాత చీరలు పదేపదే చూపించారు.

కామేశ్వరమ్మ ఏమీ మాట్లాడలేదు.

తన కొచ్చే డబ్బు వీళ్ళకి పంచి పెడితేభవిష్యత్తులో తమ ముసలి బతుకులు ఎలా వెళ్ళాలి? పోనీ కొడుకు ఏమైనా నెలనెలా పంపుతున్నాడా అంటే—







ఉద్యోగంలో చేరిన పదేళ్ళలో ఏ నాడూ ఒక పాతిక రూపాయలు చేతిలో పెట్టిన పాపాన పోలేదు. ఇన్నాళ్ళూ రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించి ఇంతవాళ్ళను చేసిన తమని ఈ వయసులో మీకు ఏ బాదర బందీ వద్దు హాయిగా ఉండమని ఆదుకోవడం పోయి ఇంకా ఏదో మేమే పెట్టాలన్న ఈ మనస్తత్వాలేమిటి? ఇలా అనేక సార్లు కామేశ్వరమ్మ ఆలోచించి చూసింది. భర్త దగ్గరకూడా ఈ విషయంలో బాధ పడితే "పోనీ లేవోయ్. ఆ వెధవలకి మనం ఏ జన్మలోనో ఋణం ఉన్నాం. అందుకే అలా పీడిస్తున్నారు" అని తేలిగ్గా రామనాథం తీసిపారేశాడే తప్ప భార్యలా మధన పడలేదు.

'అమ్మా! నాన్నా, మీరు రిటైరయి పోయారుగా ఈ వయసులో ఇక్కడేం అవస్థ పడతారు. ఈ ఇల్లు అమ్మేసి ఆ డబ్బు బాంకులో వేసుకుని హాయిగా నా దగ్గర కొచ్చేసి కృష్ణా రామా అంటూ ఉండండి' అని ఇప్పుడైనా ఒక తృప్తికరమైన మాట కొడుకు నోటంట వస్తుందేమోనని వారం నుంచీ ఎదురు చూసిన కామేశ్వరమ్మ ఆశ దురాశే అయింది.

వచ్చిన దగ్గరినుంచి కోడలుతో సహా అంతా ఇబ్బందుల గురించి తప్ప రెండో మాట లేదు.

ఇంత జీవితాన్ని చదివినా రామనాథంలో మార్పు లేదు.

పిల్లలూ, వాళ్ళ మనస్తత్వాలు ఎలా ఉన్నా కనీసం భర్త నుంచైనా తను ఆశించిన జీవితం కనిపిస్తే కామేశ్వరమ్మకి దిగులు లేకపోయేది.

ఉద్యోగం విరమించిన తను ఇంక ఏం చెయ్యాలి? సమాధానం లేని ఆలోచనల గందరగోళం మధ్య కామేశ్వరమ్మ కొట్టుమిట్టులాడుతుంటే శిధిలావస్థలో ఉన్న పెంకుటింటి ముందు రిక్షా ఆపాడు.

కునికిపాట్లు పడుతున్న మనవరాల్ని లేపి రిక్షా దిగింది కామేశ్వరమ్మ.

"అమ్మకి ఎలా లేదన్నా పాతిక వేలు పైచిలుకు వస్తాయిగా. గొలుసు చేయించమంటే ఇప్పుడెందుకూ అంటూంది."

"ఎంత సేపూ మీ ఆడాళ్ళకి బంగారాలు, పట్టు చీరలూను. అదేదో హాయిగా డబ్బు తీసుకుని బాంక్‌లోనో, వడ్డీలకో ఇచ్చుకుంటే పిల్లల్ని పెడుతుంది."

కామేశ్వరమ్మ గుమ్మంలో అడుగు పెట్టేసరికి కూతుళ్ళూ, కోడలు, కొడుకూ—అంతా సాగిస్తున్న చర్చ అది.

తల్లిగా ఆమె మనస్సు చివుక్కు మనిపించింది.

ఆ రాత్రి ఆమెకి నిద్ర పట్టలేదు.

ఎన్నడూ అనుభవించని బాధ, అదే గుండెమంట ఆమెను చిత్రవధ చేస్తున్నాయి.

మరునాడు ఉదయం తల్లిగా వాళ్ళకి కాఫీ టిఫిన్ కూడా ఇవ్వాలనిపించలేదు కామేశ్వరమ్మకి. మామూలుగా భర్తకి మాత్రం అందించి, తను తీసికున్నది.

"అమ్మా! నీకు రావలసిన ప్రావిడెంటు ఫండు వగైరా ఎన్నాళ్ళలో వస్తుందన్నారు?" అనడిగాడు కొడుకు తొమ్మిది గంటల ప్రాంతంలో. సమాధానం కోసం అంతా చెవులు రిక్కించుకున్నారు.

కామేశ్వరమ్మ మాట్లాడలేదు.

"నీ పేరు పెట్టుకున్నందుకు మీ అమ్మాయికి లాకెట్ చేయించవూ?" చిన్న కూతురు గారాబం పోయింది.

"ఒక్క జత గాజులు చేయించి పెట్టమ్మా. నీ పేరుమీద ఉంటాయి." పెద్ద కూతురు నిష్ఠూరం ధ్వనింప చేసింది.

ఎవరికీ ఏ సమాధానమూ ఇవ్వలేదు కామేశ్వరమ్మకి.

గంట గడిచాక అంతా భోజనాల దగ్గర కూర్చున్నప్పుడు గంభీరంగా అన్నది కామేశ్వరమ్మ.

"నా కొచ్చే డబ్బులో ఎవరికీ ఒక్క పైసాకూడా ఇవ్వదలుచుకోలేదు." ఆ మాటకి చివుక్కున షాక్ తిన్నట్టు అంతా ఒక్కసారి ఆమెనే చూశారు.

"నా కడుపున పుట్టిన మీ ముగ్గురి స్థితి గతులూ బాగానే ఉన్నాయి. ఇన్నాళ్ళూ మీ కోసం బతికాం. పెట్టుపోతలేవో సాధ్యమైనంతగా పెట్టాం. పుట్టింటినుంచైనా, అత్తింటి నుంచైనా పరిమితంగా తెచ్చుకోవడం సంస్కారం. ఇక నాకు వచ్చే డబ్బుతో నేనూ, మీ నాన్నగారూ బతికినంత కాలం ఒకళ్ళ మీద ఆధారపడకుండా బతికి ఆ తరవాత ఆ మిగిలింది ఏ అనాధులకో ఇవ్వాలనుకుంటున్నాను. ఇంక ఆ డబ్బు గురించీ, మీ కోర్కెల గురించీ ప్రసక్తి తేకండి" అని గంభీరంగా అనేసింది కామేశ్వరమ్మ.

భర్త తప్ప అంతా అవాక్కయి పోయారు. మరో మాటకి కామేశ్వరమ్మ అవకాశం ఇవ్వకుండా భోజనం ముగించి వంటిల్లు సర్దడం కోసం వెళ్ళింది.

రామనాధానికి తప్ప మిగిలిన వాళ్ళెవరికీ అన్నాలు సహించ లేదు. ఆ మధ్యాహ్నమే హడావుడిగా బట్టలు సర్దుకుని వెళ్ళిపోయారు కూతుళ్ళూ, కొడుకునూ ముఖాలు మాడ్చుకుని.

వాళ్ళు వెళ్ళిన చాలాసేపటికి గదిలో ఒంటరిగా అచేతనంగా కూర్చుని కళ్ళ నీళ్ళు పెట్టుకుంటున్న భార్యని సమీపించాడు రామనాథం.

ఆమె భుజం మీద చేయి వేశాడు.

"నేను తప్పు చేశానంటారా?" అడిగిం దామె జాలిగా.

"కాదు! ఏం చెప్పినా కరెక్ట్. నువ్వు ముందుకి చూస్తావు. నేను ఆ క్షణం చూస్తాను. మన కడుపున పుట్టిన వెధవలు డబ్బు మాత్రమే చూస్తున్నారు" అన్నాడు ఆమెను పొదివి పట్టుకుని.

"పోనీ వాళ్ళకి కావలిసిందేదో ఇచ్చేసి—"

"వద్దు, కాదు! ఆ డబ్బు నువ్వేం చెయ్యాలను కున్నావో అలానే చెయ్యి. నీ ఇష్టం" అన్నాడు రామనాథం మార్దవంగా.

ఎన్నాళ్ళకి, ఎంత చక్కగా భర్త మాట్లాడుతున్నాడు! ఆమె ఆనం దానికి అవధుల్లేకపోయాయ్.

అరవైలో ఇరవై వచ్చినంత సంతోషం ఆమెది.

*